## 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి'

కామారెడ్డి, జూన్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ పెంపును జనవరిలో మంజూరు చేస్తామని చెప్పి 6 నెలల 11 రోజులు గడుస్తున్నా పింఛన్ పెంపుపై ఇప్పటి వరకు జీవో ఇవ్వలేదని విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవల పక్క రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ఇచ్చిన మాట ప్రకారం జీవో జారీ చేయడం అభినందనీయమని అన్నారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల సంక్షేమం కోసం పింఛన్ అమలు చేయాలని లేదంటే మరో ఉద్యమానికి దివ్యాంగులు సిద్ధం కావాలని కోరారు.

## కామారెడ్డి రోటరీ క్లబ్ సభ్యులకు ఉత్తమ అవార్డులు



ఉత్తమ అవార్డులు అందుకుంటున్న కామారెడ్డి వాసులు

కామారెడ్డి, జూన్ 17 : రాష్ట్ర వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి భద్రాచలంలో నిర్వహించిన సేవలకు పట్టాభిషేకం పురస్కారాల్లో కామారెడ్డి క్లబ్, అధ్యక్షుడు పోలబోయిన సత్యం కు ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపిక చేసి రాష్ట్ర రోటరీ గవర్నర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి రోటరీ క్లబ్‌కు జూలై 2023న పదవీ బాధ్యతలు చేపట్టి 12 నెలల కాలం లో సుమారు 60కిపైగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికి ధన్యవాదాలు అని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెనుబెల్లి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోరణాల సుధాకర్, సీనియర్ సభ్యులు డాక్టర్ బాలరాజు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసాయిపేటలో బోర్‌మోటర్ ప్రారంభం

మాచారెడ్డి, జూన్ 17 : పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం బోర్‌మోటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహాచారి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నదని ఎమ్మెల్యే రమణారెడ్డికి విన్నవించగా వెంటనే స్పందించి బోర్ తో మోటర్ ను అందజేసినట్లు తెలిపారు. గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


బోర్‌మోటర్‌ను బిగిస్తున్న నాయకులు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్


మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హాఫీజ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

- ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింల ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు,నాయకులు

నమస్తే తెలంగాణ, జూన్ 17 : త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లాలోని ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికీ ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడిచి పేదలకు దాన ధర్మాలు చేయాలని, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని మతపెద్దలు ఉద్బోధించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకొని తీపీ పదార్థాలతోపాటు మేక మాసంతో వంటలను చేసుకున్నారు. బంధువులు, స్నేహితులతో ఇండ్లు సందడిగా మారాయి.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలకు కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హాఫీజ్‌కు గంప గోవర్ధన్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట, రామారెడ్డి, లింగంపేట, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. బాన్సువాడ పట్టణంలో ఈద్గా వద్ద మైనార్టీలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్ శుభాకాంక్షలు తెలిపారు. మాచారెడ్డి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారం మధుసూదన్, నాయకులు రాజేందర్, నగేంద్ర వర్మ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు


కామారెడ్డిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ


బీర్కూర్‌లోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పెద్ద కొడప్‌గల్‌లో..


ఎల్లారెడ్డిలో..


రామారెడ్డిలో


బిచ్కుందలో..


నాగిరెడ్డిపేటలో..


లింగంపేటలో

## రోడ్డుపై నీటి గుంత ..


డోంగ్లీలోని అంబేద్కర్ భవనం వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

డోంగ్లీ, జూన 17: మండల కేంద్రం నుంచి కుర్ల, మదన్‌హిప్పర్గకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో అందులో వర్షపు నీరు చేరి నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఇదే రోడ్డుకు సమీపంలో పీహెచ్‌సీ, తహసీల్ కార్యాలయం ఉన్నాయి. ఈ రోడ్డు అధ్వానంగా మారిండంతో ఉద్యోగులు, సిబ్బంది, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


కళాకారుడు మిద్దె రమేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంప శశాంక్

రాజంపేట్, జూన్ 17: మండలంలోని పొందుర్తి గ్రామానికి చెందిన కళాకారుడు మిద్దె రమేశ్ తండ్రి మిద్దె నర్సయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనయుడు గంప శశాంక్ సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. గంప శశాంక్ వెంట కంకణాల శ్రీధర్, కంకణాల రవీందర్, రాములు, లింగం, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి, జూన్ 17: మండలంలోని అన్నారం గ్రామంలో అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుద్దాల చిన్న సాయిలు (51) గతంలో గల్ఫ్ దేశం వెళ్లడానికి అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అప్పులను ఎలా తీర్చాలో ఆలోచిస్తూ బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం తన వ్యవసాయ బావి వద్ద ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కొండ విజయ్ తెలిపారు. భార్య దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

### విద్యుత్ ప్రజావాణిలో అధికారులు

ఎల్లారెడ్డి, జూన్ 17 : ఎల్లారెడ్డి విద్యుత్ డివిజన్ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి పది ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా, లైన్లలో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర సమస్యలతోపాటు రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి సిబ్బందికి సూచనలు చేస్తామని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎలాంటి సమస్యనైనా వినతి పత్రం ద్వారా తెలుపాలని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని డీఈఈ సూచించారు.

**లింగంపేటలో..**
లింగంపేట, జూన్ 17: మండల కేంద్రంలోని లింగంపేట సెక్షన్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించినట్లు ఏఈ సాయినాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని మత్తడికింది పల్లెలో విద్యుత్ తీగలను సరి చేయాలని ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

**బీర్కూర్‌లో..**
బాన్సువాడ, జూన్ 17 : బీర్కూర్ విద్యుత్ ఉప కేంద్రంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో పంటపొలాల వద్ద విద్యుత్ సమస్య ఉంటే తమకు తెలియజేయాలని, పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, సమస్యలను నేరుగా చెప్పవచ్చని సూచించారు.

**బిచ్కుందలో..**
బిచ్కుంద, జూన్17: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లోని సహాయక ఇంజినీర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వినియోగదారుల నుంచి గృహజ్యోతి పథకానికి సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ ప్రశాంత్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంసింగ్, జేఎల్ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్ విద్యుత్ ఉప కేంద్రంలో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఏఈ రాంప్రసాద్



బిచ్కుందలో వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు



ఎల్లారెడ్డిలో వినతి పత్రం స్వీకరిస్తున్న డీఈఈ గణేశ్

# డంపింగ్ యార్డుగా మారిన క్రీడా ప్రాంగణం

లింగంపేట, జూన్17: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం డంపింగ్ యార్డులా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించింది. క్రీడా ప్రాంగణం వెనుక భాగంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. కానీ డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ చెత్తను క్రీడా ప్రాంగణం ఆవరణలో వేస్తుండడంతో క్రీడల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. క్రీడా ప్రాంగణంలో చెత్త వేయడంతో ఆటలు ఆడడానికి వీలు లేకుండా పోయిందని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


క్రీడా ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

## ప్రభుత్వ భూములను కాపాడాలి

### ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు రైతుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎల్లారెడ్డి, జూన్ 17: ఎల్లారెడ్డి శివారులోని నాగన్న కుంట, రాజుల కుంటకు సంబంధించిన స్థలాన్ని కబ్జాకాకుండా కాపాడాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు వారు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ వ్యవసాయభూములకు వెళ్లడానికి దారి లేదని, సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు.వినతిపత్రం ఇచ్చినవారిలో పూజారి రాములు, శ్రీనివాస్, విద్య రవికుమార్ తదితరులు ఉన్నారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

నిజాంసాగర్, జూన్17: మండలంలోని హసన్ పల్లి గ్రామ శివారులోని నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందారు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తండాకు చెందిన కేతావత్ జైపాల్(35) చేపలు పట్టేందుకు నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.